



పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు, అడుగు వేస్తున్న చిన్నారి

'ఓపి'క ఉండాల్సిందే..!

- జిజిహెచ్‌లో ఈ-ఆస్పత్రి విధానం - గంటల కొద్దీ తప్పని నిరీక్షణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్)లో వైద్యం చేయించుకునేందుకు ఓపి కావాలంటే ఓపిక ఉండాల్సిందే. ఈ-ఆస్పత్రి విధానం అమలు చేస్తుండటంతో టోకన్ల కోసం రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన విధానాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-ఆస్పత్రి విధానంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్)లో మూడు నెలలుగా ఈ-ఆస్పత్రి విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత ఆన్‌లైన్‌లో టోకెన్ నెంబర్ పొందిన వారికి మాత్రమే ఆస్పత్రి ఓపి కౌంటర్‌లో ఓపి తీసుకునేందుకు వీలుంటుంది. ఆన్‌లైన్‌లో టోకెన్ నెంబర్ పొందాలంటే ఓపి కౌంటర్ ముందు ఏర్పాటు చేసిన కౌంటర్లలో రోగి ఫోన్ నెంబర్‌తో రిజిస్టర్ కావాల్సి ఉంటుంది. ఫోన్ నెంబర్‌కు వచ్చిన ఒటిపిని ఎంటర్ చేశాక రోగి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. సాంకేతిక కారణాలతో ఒటిపి రాకపోతే అది వచ్చే వరకూ రోగులు వేచి చూడక తప్పడం లేదు. అన్ని వివరాల నమోదు పూర్తయిన తర్వాత టోకెన్ నెంబర్ వస్తుంది. ఆస్పత్రి ఓపి కౌంటర్‌లో ఆ టోకెన్ నెంబరుతో పాటు తండ్రి పేరు చెప్పి ఓపి పొందాల్సి వస్తోంది. ఫోన్ లేని రోగులు టోకెన్ తీసుకునేందుకు వీలు లేకుండా పోతోంది. సాంకేతిక సమస్యలు తలెత్తినా, సర్వర్ పని చేయకపోయినా రోగులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం టోకెన్లను నమోదు చేసే ప్రక్రియ కోసం ట్రెయినీ నర్సింగ్ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. వారు ఫోన్లలో రోగుల వివరాలను నమోదు చేసి టోకెన్ నెంబర్లను చెబుతున్నారు. తక్కువ సంఖ్యలో వారిని కేటాయించడం, రోగులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో టోకెన్ తీసుకునేందుకే గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. తర్వాత ఓపి చీటీ పొందడానికి మళ్లీ ఎదురుచూడాల్సి వస్తోంది.

సోమవారాల్లో కిటకిట

ఆదివారం ఆస్పత్రికి సెలవు కావడంతో జిజిహెచ్‌లో సోమవారం వచ్చిందంటే చాలు రోగులతో కిటకిటలాడుతోంది. ఈ సోమవారం కూడా రోగులు కిక్కిరిసిపోయారు. దాదాపు 2వేల మంది వరకూ ఓపి సేవలను పొంది ఉంటారు. ఈ-ఆస్పత్రి విధానం వల్ల ఇలాంటి సమయాల్లో గంటలకొద్దీ క్యూలో నిల్చోలేక కొంత మంది రోగులు వెనుదిరిగి వెళ్లిపోతున్నారు.

అవసరమైతే కౌంటర్లు పెంచుతాం

- వెంకట రంగారెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల్లో భాగంగా ఈ-ఆస్పత్రి విధానాన్ని అమలు చేస్తున్నాం. మొదట్లో కాబట్టి కొంత ఇబ్బందిగా ఉంటుంది. సాంకేతిక సమస్య వస్తేనే ఇబ్బంది అవుతుంది. లేకుంటే ఇబ్బందులేమీ ఉండవు. అవసరమైతే కౌంటర్లను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.



రోగుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

వేదవతి సాధనకు పోరు బాట

- రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన పాదయాత్ర

ప్రజాశక్తి-ఆలూరు/హాలహర్వి

ఆలూరు, ఆదోని నియోజకవర్గ ప్రాంత ప్రజల కోసం వేదవతి రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పోరు బాట ప్రారంభమైంది. సోమవారం హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామంలో రైతుల పాదయాత్రను ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యంతో కరువు కాటకాల్లో మగ్గుతూ రైతులు, వ్యవసాయ కూలీలు, యువత వలసలు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. తాగేందుకు నీరు లేక 10 నుంచి 15 రోజులకోసారి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ, పాలకుల మెడలు వంచి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఆలూరు నియోజకవర్గం శాశ్వత కరువు నివారణ కోసం సాగు, తాగునీటి కోసం వేదవతి ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించి, నిర్మాణం పూర్తి చేయాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జింకల పార్కు ఏర్పాటు చేసి రైతుల పంటలను కాపాడి, ఆదుకోవాలని కోరారు. ఆలూరు చెరువును ఎస్ఎస్ ట్యాంకుగా మార్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాలని రైతులను, ప్రజలను, యువతను చైతన్య పరచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర నిట్రవట్టిలో ప్రారంభమై దేవరగట్టు, కొత్తపేట, నెరణికి తండాలో బస చేశారు. నేడు నెరణికి నుంచి కరిడిగుడ్డం, హులేబీడు, తుంబలబీడు, పెద్ద హోతూరు వరకు పాదయాత్ర సాగుతుంది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి, రైతుసంఘం మండల కార్యదర్శి ఈరన్న, కృష్ణ, షాకీర్, వెంకటేశులు, నాగరాజు, మైనా, గోవర్ధన్, విఠల్, షేకున్‌బీ, గౌసియా బీ, రాధమ్మ, పోతురాజు, బసవరాజు, పరమేష్, హరికృష్ణ, రవి, శంషాద్ బీ, క్రమూన్‌బీ, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు ఓపిలు పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి ఓపిల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి ఒపి శాతాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దకడుబూరు, హోళగుంద, కృష్ణగిరి, కౌతాళం, కోసిగి మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శాతం తక్కువగా ఉందన్నారు. బుధవారం నాటికి వాలంటీర్ల చేత సురక్ష సర్వేను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సిఇఒను అదేశించారు. తక్కువ శాతం పురోగతి సాధించిన మండలాల ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. జగనన్న సురక్ష టోకెన్ జనరేషన్ చేయడంలో కర్నూలు, మంత్రాలయం రూరల్, కౌతాళం, గూడూరు మండలాలు జీరో జెనరేట్ చేయడం ఏంటని టోకెన్ జనరేషన్ శాతాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రాప్‌కు సంబంధించి ఫార్మర్స్ ఇకెవైసి పూర్తి చేయడానికి రేపు చివరి తేది అని అయితే ఇప్పటివరకు కేవలం 84 శాతం మాత్రమే చేశారని పేర్కొన్నారు. దేవనకొండ, హోళగుంద, ఎమ్మిగనూరు వంటి మండలాలు ఫార్మర్స్ ఇకెవైసి 94 శాతం సాధిస్తుంటే చిప్పగిరి, మద్దికెర మండలాలు మాత్రం 73 శాతమే పురోగతి సాధించడం ఏంటని, రేపటిలోపు 100 శాతం పురోగతి సాధించకుంటే సంబంధిత మండలాల వ్యవసాయ అధికారుల మీద చర్యలు తప్పవన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు సంబంధించి వచ్చిన అర్జీలు బియాండ్ ఎస్-ఎల్ఎకు వెళ్లకూడదన్నారు.

అసంతృప్తి కేసులు ఉండకూడదు : కలెక్టర్

జగనన్నకు చెబుదాం - స్పందన అర్జీల పరిష్కారంలో రీఓపెన్, అసంతృప్తి కేసులు ఉండకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో -స్పందన" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమంలో అర్జీల పరిష్కారానికి సంబంధించి రీఓపెన్, అసంతృప్తి కేసులు మరలా పెరుగుతున్నాయని, అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించిన మండలాలు, గ్రామాల అధికారులు అర్జీలను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు. ఎన్ని రీ ఓపెన్ అవుతున్నాయి, ఎన్ని అసంతప్తి కేసులు ఉన్నాయని జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అందుకు సంబంధించిన ఆడిట్ నివేదికలను ప్రతి జిల్లా అధికారి ప్రతి శనివారం తమకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ, జిల్లా పరిషత్ సిఇఒలను ఆదేశించారు. అర్జీదారులను కార్యాలయానికి పిలిపించుకుని పరిష్కారానికి సంబంధించిన ఎండార్స్‌మెంటును వారి చేతికి ఇచ్చి ముట్టినట్లు రశీదును పొందాలన్నారు. రాతపూర్వకంగా కూడా ఆదేశాలిచ్చామని, ప్రతి జిల్లా అధికారి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమానికి కచ్చితంగా హాజరు కావలసిందే నని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏ శాఖకు ఇందులో మినహాయింపు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.మధుసూదన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫలించిన క్లాప్ డ్రైవర్ల పోరాటం

- డిమాండ్లను అంగీకరించిన యాజమాన్యం

- రేపటి నుంచి విధుల్లోకి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత 20 రోజులుగా క్లాప్ డ్రైవర్స్ చేస్తున్న ఆందోళన ఫలితంగా రెడ్డి ఏజెన్సీ యాజమాన్యం దిగివచ్చి డ్రైవర్ల డిమాండ్లను అంగీకరించిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు తెలిపారు. లేబర్ కార్యాలయంలో కార్మిక శాఖ అధికారిని రమణమ్మ ఆధ్వర్యంలో రెడ్డి ఏజెన్సీ యాజమాన్యం తరపున మేనేజర్ తన్వీర్ యూనియన్ తరపున సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు షఫీ, అశోక్, రాజేష్ తదితరుల సమక్షంలో చర్చలు జరిగినట్లు తెలిపారు. పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించడానికి అంగీకరించారు. పది రోజుల లోపల ఒక నెల వేతనం, మిగిలిన వేతనాలన్నీ ఈ నెల చివర కల్లా పెండింగ్ వేతనాలు చెల్లించడానికి యాజమాన్యం తరపున అంగీకరించారు. డ్యూటీలోకి కార్మికులందరిని తీసుకొనడానికి అంగీకరించినట్లు తెలిపారు. సమస్యను ఈ నెల చివరకు అంతా పరిష్కారం చేసే విధంగా అంగీకారం కుదిరింది. వీక్లీ ఆఫ్‌లు ఇవ్వడానికి అంగీకరించారు. ఈ ఒప్పందం ప్రకారం మంగళవారం నుంచి డ్రైవర్లు డ్యూటీలోనికి వెళ్లాలని కార్మిక శాఖ అధికారిని రమణమ్మ డ్రైవర్లకు సూచించారు. మళ్లీ ఏదైనా సమస్య వస్తే మాకు సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒప్పందం జరిగిన అనంతరం కార్మికులు కార్మిక కర్షక భవన్లో ఓల్డ్ సిటీ(సిఐటియు)కార్యదర్శి విజయ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు మాట్లాడుతూ కార్మికులు ఐక్యమత్యంతో సహనంతో ఆందోళన చేయడం ద్వారా ఈ విజయం లభించిందన్నారు. ఎవరికైనా చెప్పుకోండి వేతనాలు ఇచ్చేది లేదు అన్నవారు ఈరోజు దిగివచ్చి వేతనాలు ఇవ్వడానికి సిద్ధమైనారన్నారు. డ్యూటీ లోకి అందర్నీ తీసుకోమని చెప్పిన యాజమాన్యం అందరూ తీసుకోవడానికి అంగీకరించిందన్నారు. గతంలో లేని వీక్లీ ఆఫ్‌ను అమలు చేయడానికి కూడా అంగీకరించడం ఒక పెద్ద విజయం అని అన్నారు. పోరాటంలో పాల్గొన్న కార్మికులందరికీ ఆయన సిఐటియు జిల్లా కమిటీ తరపున అభినందనలు తెలిపారు. అంతేకాకుండా ఈ పోరాటానికి ఆందోళనకు సహకరించిన ప్రజాసంఘాల నాయకులకు, రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మద్దతు తెలిపిన వివిధ కార్మిక సంఘాల నేతలకు రాజకీయ పార్టీలకు కార్మికుల తరపున ధన్యవాదాలు తెలిపారు. సోమవారం క్లాప్ డ్రైవర్స్‌కు మద్దతుగా జిల్లా అంతటా సిఐటియు నాయకత్వంలో మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహించిన కార్మికులందరికీ సిఐటియుజిల్లా కమిటీ ధన్యవాదాలు తెలిపింది. సిఐటియు ఓల్డ్ సిటీ నాయకులు మెహమూద్ ,కుమార్ పాల్గొన్నారు.

యూనియన్ బలోపేతానికి కృషి చేయండి

పోరాటం చేసి విజయం సాధించిన క్లాప్ డ్రైవర్లకు అభినందనలు తెలియజేసిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గమని అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ బలోపేతం చేయడం ద్వారా మన సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సిఐటియు నాయకత్వంలో నాయకులు ఇచ్చిన సూచనలు సలహాలను పాటిస్తూ విజయానికి కారకులైన కార్మికులందరిని అభినందించారు. భవిష్యత్తులో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమాలకు చేయాలని గుర్తు చేశారు. ఈ సమావేశంలో క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

పొదుపు సంఘాల బలోపేతానికి చర్యలు - డిఆర్‌డిఎ పిడి సలీం బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పొదుపు సంఘాల కులోపేతానికి చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ కార్యాలయంలో ఆయన ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం డిఆర్‌డిఎ, వైకెపి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డిఆర్‌డిఎ, వైకెపిలో జరుగుతున్న పలు కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ను అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రావు, షరీఫ్,డిపిఎంలు నరసమ్మ, అయ్యమ్మ, సుబ్బయ్యలు ఇతర సిబ్బంది పుష్ప గుచ్చాలు అందజేసి అభినందించి స్వాగతం పలికారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్, సిఐటియు నాయకులు

స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-తుగ్గలి

ఎస్‌సి, ఎస్‌టి దళిత కాలనీలలో స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన తుగ్గలిలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తిరి రమేష్ మాట్లాడుతూ దళిత కాలనీలలో స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు.కాటి కాపరులను కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళిత కాలనీలలో స్మశాన వాటికలు లేకపోవడంతో మైళ్ల కొలది దూరంలో స్మశానవాటికలు ఉండడంతో దళితులు తీవ్రం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వము దళిత కాలనీలో స్మశాన వాటికను ఏర్పాటు చేస్తామని ఒకపక్క చెపుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. జిల్లాలో ఉన్న అన్ని దళిత కాలనీలలో స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల నాయకులు శ్రీరాములు, సిఐటియు మండల కమిటీ అధ్యక్షులు రంగస్వామి, దళిత నాయకులు ప్రతాప్, శివలింగన్న, ప్రసాద్, బెన్ని, సర్వోత్తమ, వికలాంగుల సంఘం నాయకులు వినోద్, నాగరాజు పాల్గొన్నారు. తహసీల్దార్ రవికి వినతి పత్రం అందచేశారు.



ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న ఎస్‌టియు నాయకులు

పదోన్నతి ఉపాధ్యాయులకు ఘనసన్మానం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు ఇటీవల పదోన్నతిపై వెళ్లారు. సోమవారం ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సమక్షంలో మండల అధ్యక్షులు ఈశ్వరప్ప, కార్యదర్శులు సాలన్న, గోవింద్ నాయక్, దేవదాసులకు సన్మానం చేపట్టారు. ఇక్కడే ముఖ్య అతిథులుగా ఎంఇఒలు జ్యోతి, ఆదం బాషాలు పాల్గొని ముందుగా విద్యార్థులను తమ పిల్లలుగా భావించి తీర్చి దిద్దితే అదే మనకు గర్వకారణమని పేర్కొన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట వ్యకాసం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు మండలం గొందిపర్ల, పసుపల, బి. తాండ్రపాడు గ్రామాల్లో పేదలు వేసిన గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ కర్నూలు ఆర్డిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మండల కార్యదర్శి జి గోపాల్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి. నారాయణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, మండల నాయ కులు పిబి. వుసేనయ్య , డి.రాఘవేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపా ధ్యక్షుడు కె.వెంకట రాముడు లు మట్లాడారు. కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో పేపర్ మిల్లులో పనిచేసిన చిప్పర హౌస్ సెక్షన్ కార్మికులు 40 సంవత్స రాలుగా అక్కడే గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. ఇప్పుడు కంపెనీ యాజ మాన్యం కంపెనీ భూమి అమ్మకానికి పెట్టిందన్నారు. అక్కడే ఉన్న పేదల గుడిసెలు ఖాళీ చేయమని అంటున్నా రన్నారు. వారికి అక్కడే పట్టాలు ఇవ్వా లన్నారు. పసుపలలో పేదల గుడిసెలు వేసుకొని ఉంటే గుండాలతో దాడి చేసి కూల్చి వేశారన్నారు. నేటికీ వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. బి తండ్రపాడు పంచాయితీ పరిధిలో ప్రజా నగర్ కాలనీలో పేదలు గుడిసెలు వేసుకొని ఉంటే వాటిని రెవిన్యూ వారు కూల్చి వేశారన్నారు. పెద్దలు అక్రమిస్తే పరుగెత్తి పనిచేసే వారు, పేదలు సెంట్ జాగాలో గుడిసెలు వేస్తే వారిపైన దాడులు చేశారన్నారు. పేదలకు న్యాయం చెసే వరకు పోరాడతామని అధికారులు స్పష్టమైన హామీ ఇస్తే వెళతామని అన్నారు. ధర్నా వద్దకు కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్ విచ్చేసి వినతి పత్రం స్వీకరించారు. అర్హులైన వారందరికీ పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. మండల నాయకులు బీసన్న, శ్రీరాములు, నరసింహా, జగదీష్ మూడు గ్రామాల పేదలు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం, కెవిపిఎస్ నాయకులు



కలెక్టరేట్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన రైతు సంఘం నాయకులు బాలపీర బృందం

మాచాపురం రైతులకు సాగు నీరు ఇవ్వండి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నందవరం మండలం మాచాపురం గ్రామంలో గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ద్వారా చిలకలదోన రిజర్వాయర్‌ను తుంగ భద్రా నది నుండి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు సర్పంచి బాలపీరా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా నాయకులు బాలపీరా , మాచాపురం గ్రామ రైతులు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేసిన పంటలు వర్షం లేక అన్నీ ఎండు ముఖం పట్టాయన్నారు. ప్రధానంగా వరి, పత్తి,మిరప లాంటి పంటలు వేసి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయామని కలెక్టర్‌కు వివరించారు. సంబంధిత అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడం చేత తమ దృష్టికి తీసుకువచ్చామన్నారు. గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం చిరకాల డోను రిజర్వాయర్ ను నీళ్లతో నింపి రైతుల పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలన్నారు. పశు వులకు, ప్రజలకు తాగునీరు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు సత్యన్న ,సుందరరాజు ,యుహాశివ పాల్గొన్నారు.

సోషల్ సబ్జెక్ట్ కు టీచర్‌ను నియమించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జోహారాపురంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మున్సిపల్ పాఠశాలలో సోషల్ టీచర్ నియామకం వెంటనే చెప్పటాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టర్‌కు జిల్లా అధ్యక్షులు రంగప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్ , సాయి, ఉదయ్ వినతిపత్రం అందజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మున్సిపల్ హై స్కూల్ నందు 9 వ తరగతి ఎ సెక్షన్ లో 80 మంది విద్యార్థులు, 10వ తరగతి ఏ సెక్షన్ లో 80 మంది విద్యార్థులు చదువుతుండగా సోషల్ సబ్జెక్టు బోధనకు టీచర్ లేరన్నారు. శైలజ టీచర్ అనారోగ్యం కారణం వల్ల క్లాస్‌కు రాలేనని చెప్పడంతో విద్యార్థులకు సోషల్ సబ్జెక్టుకు సంబంధించిన పాఠ్యాంశాలు బోధించే వారే కరువయ్యారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే జోక్యం చేసుకొని ఈ పాఠశాలలో సోషల్ సబ్జెక్టుకు టీచర్‌ను నియమించాలన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కాన్షిరాంకు బిఎస్‌పి ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కాన్షి రామ్ బిఎస్‌పిని, అంబేద్కర్ ఆశయాన్ని ముందుకు తీసుకు పోవడానికి జీవితాంతం కృషి చేశారని బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు గాడి అరుణ్‌కుమార్ చెప్పారు. బిఎస్‌పి కర్నూలు అసెంబ్లీ అధ్యక్షులు కె. మధుకర్ అధ్యక్షతన నిర్వహించిన కాన్సిరాం వర్ధంతిలో అరుణ్ కుమార్ మాట్లాడారు. కాన్షిరామ్ తల్లిదండ్రులు ఆయనకు వివాహం చేయాలని అనుకొని వధువు ఇంట్లో తాంబూలం కూడా తీసుకున్నారు. ఈ విషయం కాన్షిరాంకు తెలిపారని, 1965లో కాన్షి రామ్ తన తల్లి దండ్రులకు 25 పేజీల ఉత్తరం రాశారన్నారు. 'నేను పెళ్లి చేసు కోను, ఇల్లు పరివారాన్ని పట్టించు కోను.తన బంధుమిత్రుల ఇండ్లలో జరిగే శుభకా ర్యాలకు హాజరుకాను. నా కోసం వ్యక్తిగతంగా ఎలాంటి ఆస్తి కూడబెట్టుకోను. బహుజన సమాజమే నా కుటుంబం, అంబేద్కర్ చేపట్టిన మహోన్నత ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడమే నా జీవిత లక్ష్యం..' అని రాశారన్నారు.



11న పురుషుల డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 11న నగరంలోని బి క్యాంపు లో ఉన్న ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హేమంత్ జెకెసి కోఆర్డినేటర్ మాదన్న సోమవారం తెలిపారు. ఇంటర్ , డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. వివరాలకు సంప్రదించాల్సిన నంబర్ 9908420348 ఫోన్ చేయాలన్నారు.



ఇస్రో పోటీలలో సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇస్రో వారు నిర్వహించిన చంద్ర యాన్ పోటీలలో వివిధ విభాగాలలో సాయి సుబ్బయ్య రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు , రవీంద్ర టాలెంట్ స్కూల్ మాధవి నగర్, రెవిన్యూ కాలనీ విద్యార్థులు చక్కని ప్రతిభ చూపించారని కరస్పాండెంట్ పిబివి. సుబ్బయ్య అభినందన సభలో తెలిపారు. క్విజ్ పోటీలలో సిహెచ్. దేవచరణ్ విజ్వల్, వ్యాసరచన పోటీలలో ఎస్. యశ్వంత్ , డ్రాయింగ్ నందు సి.చంద్రికలు బహుమతులు కైవసం చేసు కు న్నారు. వారిని కరస్పాండెంట్ పిబివి. సుబ్బయ్య , అధ్యాపకులు అభినం దిస్తూ పోటీ పరీక్షలలో రాణించేందుకు ఇలాంటివి ఉపయోగపడుతా యని తెలిపారు.

'సురక్ష' తో ప్రజల వద్దకు సేవలు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


మందులు పంపిణీ చేస్తున్న బాలనాగిరెడ్డి

వైసిపి ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని 52 బసాపురంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు. అనంతరం గర్భిణులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్టు అందజేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వైసిపి మండల నాయకులు గుర్రెడ్డి లక్ష్మికాంత రెడ్డి, దశరథ రెడ్డి, సర్పంచి రాఘవరెడ్డి పాల్గొన్నారు. **కౌతాళం** మండలం బాపురం గ్రామ సచివాలయ పరిధిలో సర్పంచి శిల్పా రెడ్డి అధ్యక్షతన 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. డాక్టర్లు ఇమ్మనియాల్, రామ శిరీష, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షల వరకు బీమా కార్డులను పంపిణీ చేశారు. నాయకులు గురునాథ్ రెడ్డి, ఎంపిడిఒ సుబ్బరాజు, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ వహీద్, అయ్యప్ప రెడ్డి, దశరథ రెడ్డి పాల్గొన్నారు. **హొళగుంద** మండలం ఎల్లార్తి గ్రామంలో సర్పంచి కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. జెసిఎస్ మండల కన్వీనర్ మల్లికార్జున, తహశీల్దార్ హుస్సేన్ సాబ్, ఎంపిడిఒ సుహాసిని, ఇఒఆర్‌డి చంద్ర మౌళీశ్వర గౌడ్, పంచాయతీ కార్యదర్శి షాపి, యువ నేత ఎస్‌కె.గిరి, దరగప్ప, డాక్టర్ న్యూటన్ రాధ పాల్గొన్నారు.

చేగువేరా ఆశయాలను నెరవేరుస్తాం

- ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-ఆలూరు


చేగువేరా చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ప్రపంచ మానవాళి విముక్తి కోసం పోరాడిన చేగువేరా ఆశయాలను నెరవేరుస్తామని డివైఎఫ్‌ఐ మాజీ నాయకులు డి.గౌస్ దేశాయి. పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆలూరు దేవరగట్టు ఫారెస్ట్‌లో చేగువేరా వర్ధంతి నిర్వహించారు. డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి మైనా అధ్యక్షత వహించారు. అనంతరం చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చేగువేరా ఒక గెరిల్లా విప్లవకారుడు, మనసున్న డాక్టర్, మహాకవి, గొప్ప రచయిత, ప్రాణమిచ్చే స్నేహితుడని కొనియాడారు. క్యూబా అభివృద్ధి కోసం పోరాడిన యోధుడు, అమెరికా సామ్రాజ్యవాదులకు సింహ స్వప్నమని తెలిపారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి క్యూబాలో విప్లవాన్ని విజయవంతం చేశారని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని, అణచివేతను యువత ప్రశ్నించాలని తెలిపారు. డివైఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్దన్, డివైఎఫ్‌ఐ నాయకులు గోపాల్, రాకేష్, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు పోతురాజు, మండల నాయకులు గిరి మూర్తి, పరమేష్, బసవరాజు, రవి, హరికృష్ణ, అంకీర్ నందన్, జగదీష్, ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కమిటీ నాయకులు శంషాద్ బీ, కమ్రుద్దీన్ బీ, మహిళా సంఘం నాయకులు షేకున్ బీ, గౌసియా బీ, రాధమ్మ పాల్గొన్నారు.

'ప్రతిభ'కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి - కౌతాళం

పట్టణంలోని ప్రతిభ హై స్కూల్‌కు రెండు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వచ్చాయని పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఈనెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం (అపుస్మా) ఆధ్వర్యంలో 2023వ సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రకటించినట్లు తెలిపారు. కర్నూలులోని మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో కౌతాళం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఉపాధ్యాయులు కె.రాజు, కె.భీమేష్‌లు అవార్డు అందుకున్నట్లు చెప్పారు. సయ్యద్, సెక్రటరీ మైనుద్దీన్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, సీనియర్ ఉపాధ్యాయులు జయలక్ష్మి, రామలక్ష్మి, ఉపాధ్యాయులు శిరీష, పరమేష్, ముంతాజ్, సునీల్, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్ పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ప్రతిభ హైస్కూల్ ఉపాధ్యాయులు

ఇంటింటా జ్వరపీడితులే...

- సరిపడే బెడ్లు లేవు..!
- వణికిస్తున్న వైరల్ ఫీవర్...
- గ్రామాల్లో కానరాని వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గత కొద్దిరోజుల నుంచి వాతావరణంలో మార్పుల వల్ల మండలంలోని చాలా గ్రామాల్లో చిన్న, పెద్ద అని తేడా లేకుండా వైరల్ ఫీవర్ వణికిస్తోంది. పగటి పూట ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే చల్లని గాలులు వీస్తున్నాయి. ఈ మార్పుల వల్లే జ్వరాలు వెంటాడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

మండలంలో రోజురోజుకు వైరల్ ఫీవర్‌తో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి జరాలు అధికమవుతున్నాయి. మండలంలోని ఓ గ్రామంలో కుటుంబంలో కనీసం ఒకరికి జ్వరం వచ్చినట్లు సమాచారం. వైరల్ ఫీవర్‌తో ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. విషజ్వరాల కారణంగా ప్రయివేట్ ఆస్పత్రులు రద్దీగా మారుతున్నాయి. కొందరు ప్రయివేట్ ఆస్పత్రి యాజమాన్యాలు రకరకాల పరీక్షల పేరుతో ప్రజల దగ్గర ఫీజులు దండుకుంటున్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపిలు, ప్రయివేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆదోనిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు సక్రమంగా వైద్యం అందడం లేదని చర్చించుకుంటున్నారు.

ఆదోని ఏరియా ఆస్పత్రిలో విష జ్వరాలతో జనం వణికిపోతున్నారు. ఏ ఇంట చూసినా జ్వరపీడితులే దర్శనమిస్తున్నారు. ఆదోని ప్రభుత్వాస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. గతంలో రోజూ 259 వరకు ఒపి వస్తుండగా వారం రోజులుగా 500 నుంచి 700 వరకు నమోదవుతోంది. సోమవారం ఒక్క రోజే 280కి పైగా అవుట్ పేషెంట్లు ఆస్పత్రికి వచ్చారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఒపి విభాగం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఒపి చీటీలను మాన్యువల్‌గా రాసి ఇవ్వాల్సి వచ్చింది.

అన్ని వార్డులు కిటకిట

జ్వరం, వాంతులు, విరోచనాలతో జనం ఆస్పత్రిలో చేరుతున్నారు. వార్డులన్నీ కిటకిటలాడుతున్నాయి. రోగుల రద్దీ కారణంగా కాన్పుల వార్డును సైతం రోగుల కోసం వినియోగిస్తున్నారు. సరిపడ బెడ్లు లేకపోవడంతో ఒక మంచంపై ఇద్దరు రోగులను ఉంచుతున్నారు. సోమవారం అన్ని వార్డుల్లో 60 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. బెడ్ల కొరత వల్ల వ్యాధి కొద్దిగా నయం కాగానే డిశ్చార్జ్ చేస్తున్నట్లు తెలిసింది.


వైద్యం కోసం క్యూలో నిల్చున్న ప్రజలు

రోగుల తాకిడి పెరిగింది

- ఆదోని ఏరియా ఆస్పత్రి హెడ్ నర్సు

విష జ్వరాల కారణంగా ఆస్పత్రికి రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బాధితుల్లో అధికంగా జ్వరపీడితులే ఉంటున్నారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులూ జ్వరపీడితులతో నిండిపోయాయి. బెడ్లు సరిపోవడం లేదు. రోగులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూస్తున్నాం.

రెండు రోజులుగా ఒకే మంచంపై ఇద్దరు ఉన్నాం

- రోజా, ఆదోని

పాపకు జ్వరం వస్తే రెండురోజుల క్రితం ఆదోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చాను. జ్వరం ఎక్కువగా ఉండడంతో వైద్యులు ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ప్రస్తుతం గ్లూకోజ్‌లు ఎక్కుతున్నాయి. బెడ్లు సరిపడ లేకపోవడంతో మా పాప మంచంపై మరో అమ్మాయిని ఉంచి చికిత్స అందజేస్తున్నారు. వైద్యం మంచిగానే ఉంది.

గ్రామాల్లో వైద్య శిబిరాలేవి..?

మండలంలోని ప్రజలు వైరల్ ఫీవర్‌తో ఇబ్బంది పడుతున్నా గ్రామాల్లో ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-ఆదోని

ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉవారిని యుటిఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం పట్టణంలోని నేషనల్ హైస్కూల్ సమావేశపు భవనంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.గాదిలింగప్ప అధ్యక్షతన జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన జంబులింగయ్య, సలావుద్దీన్, శకుంతల, సావిత్రి, ఆదిమూర్తి, పదోన్న తుల్లో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన జిసి.షేకన్న, రవికుమార్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు జీవిత, యుటిఎఫ్ సీనియర్ నాయకులు పాపయ్య, రుద్రముని, శ్రీనివాసులు, నారాయణ, నర్సయ్య గౌడ్, ఆవుల బసప్ప, ఎల్‌కె.బసప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో విషాదం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో విషాదం చోటు చేసుకుంది. సోమవరం బస్టాండ్‌లో ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఓ ఆర్‌టిసి అవుట్సోర్సింగ్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల మరో డ్రైవర్ మృతి చెందారు. పలమనేరు డిపో బస్సు డ్రైవర్ శేఖర్ (55) బస్సు కింద పడి మరణించారు. ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు డ్రైవర్ రమేష్ బస్సును డిపో నుంచి ప్లాట్ ఫామ్‌పైకి తీసుకొస్తుండగా ప్లాట్ ఫామ్ దగ్గరలో నడుచుకుంటూ వెళ్తున్న డ్రైవర్ శేఖర్‌ను బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ బస్సు ఇన్ నుంచి లోపలికి రావాల్సింది పోయి అవుట్ నుంచి లోపలికి రావడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి వాటా కేటాయింపులో అన్యాయం

- కృష్ణా జలాల పంపిణీ అన్యాయంపై నిరసన దీక్ష

ప్రజాశక్తి - ఆదోని

కృష్ణా జలాల పంపిణీ నేపథ్యంలో కర్నూలు పశ్చిమ ప్రాంత వాటా కేటాయింపులో అన్యాయం జరిగిందని ఆర్‌సిసి రాష్ట్ర ఆర్గనైజింగ్ అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ మైదానంలో దీక్ష సాగింది. ఆడా కన్వీనర్ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. దీక్షకు టిడిపి, జనసేన నాయకులు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడారు. ఈ పంపిణీలో ఆర్‌డిఎస్ కుడి కాలువకు, వేదవతికి 8 టిఎంసిలు కేటాయించాలని, పులికనుమ సామర్థ్యం 5 టిఎంసిలకు పెంచాలని కోరారు. మేళిగనూరు వరద కాలువ నిర్మించాలని తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... కరువు, వలసలు ఇక్కడ ఉన్నా ఒక్క ప్రాజెక్టు కొత్తది కట్టకపోగా ఉన్న వాటిని పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఆదోని కాటన్ మార్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ... ఇక్కడ పరిశ్రమలు మూతపడటానికి కారణం పంటలు లేకపోవడమే అన్నారు. ప్రాజెక్టులు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, టిడిపి నాయకులు దేవేంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, జనసేన నాయకులు తాహెర్ వలీ, పులిరాజు, పిడిఎస్‌ఒ జిల్లా కన్వీనర్ తిరుమలేష్, ఆర్‌సిసి నాయకులు ఎల్లార్తి అర్జున్, సుధాకర్ మాట్లాడారు. దీక్షలో జంగమ సంక్షేమ సంఘం నాయకులు బద్రిస్వామి, జగదీష్, జైభీం యువజన సంఘం నాయకులు బసవ, అనిల్, వీరశైవ సంఘం నాయకులు మంజునాథ్, ఆర్‌సిసి నాయకులు శాంతరాజు, నాగేష్, రాయలసీమ కళావేదిక నాయకులు రామ్ చరణ్, గోవిందన్న, అంజలి నాయుడు, షేక్షావలీ, బసాపురం శేఖర్, కమ్మరచేడు బసవరాజు, ఉరుకుంద, విజయ్, రామాంజి పాల్గొన్నారు.


దీక్షలో మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి


అదుపులో ఉన్న మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి

మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి దాడులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. సోమవారం ఎసిబి డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో అధికారుల బృందం దాడులు నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు మహాలక్ష్మి, చరణ్‌ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెడ్‌హ్యాండెడ్‌గా రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటాద్రి మాట్లాడారు. ఆదోని పట్టణంలోని మున్సిపల్ ఆది ఆంధ్ర స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఇటీవలే సస్పెన్షన్ అయ్యారని తెలిపారు. నాన్ డ్రయల్ సర్టిఫికెట్ కోసం మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు చరణ్, మహాలక్ష్మిలు రూ.30 వేలు డిమాండ్ చేసినట్లు, శ్రీనివాసులు తమను సంప్రదించారని చెప్పారు. పథకం ప్రకారం మొదటి విడతగా రూ.5 వేలు ఇవ్వగా సోమవారం మరో రూ.10 వేలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎవరైనా లంచం అడిగినా ఇచ్చిన చట్టరీత్యా నేరమన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 14400కు సమాచారం ఇవ్వాలని కోరారు.

'డిసెంబర్ ఆఖరి వరకు ఎల్‌ఎల్‌సికి సాగునీరందించాలి'

ప్రజాశక్తి -పెద్దకడబూరు

డిసెంబర్ ఆఖరి వరకు ఎల్‌ఎల్‌సికి సాగునీరందించాలని సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతుసంఘం నాయకులు పరమేష్, సిఐటియు నాయకులు ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెద్దకడబూరును కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు మంజూరు చేయాలని, ఆర్‌డిఎస్ కుడి కాలువకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. చిన్నతుంబలం హనుమంతు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, రామాంజనేయులు కోరారు. సోమవారం సిపిఎం ప్రతినిధి బృందం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో నేమకల్లు ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఒకే పైపులైన్ ద్వారా 16 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. మధ్యలో పైపులైన్ మరమ్మతులకు రావడంతో ఆ గ్రామాలకు వారం నుంచి పది రోజుల పాటు నీరందే అవకాశం లేదని చెప్పారు. వెంటనే రెండో పైపులైన్ ఆరెకల్ వరకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గనేకల్ గ్రామంలో శ్మశానానికి వెళ్లాలంటే రైల్వే ట్రాక్ దాటాల్సి వస్తోందని, ప్రమాదాలు జరిగిన ఘటనలూ ఉన్నాయని తెలిపారు. శ్మశానానికి రస్తా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కుప్పగల్లు గ్రామంలో శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. పెద్దతుంబలం గ్రామంలో 11కెవి విద్యుత్ తీగలు మిద్దెలకు ఆనుకుని వెళ్లాయని, వాటిని మార్చాలని కోరారు. మదిరె గ్రామంలో 2001లో ఇచ్చిన పట్టాల లబ్ధిదారులకు ఇంటి స్థలం చూపించాలని డిమాండ్ చేశారు. ఇస్వి, జాలమంచి, నాగలాపురం, పాండవగల్ నుంచి కుప్పగల్ స్టేషన్ వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, గనేకల్ జగనన్న కాలనీ పక్కన వంకపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పాండవగల్ పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం శాఖ కార్యదర్శి పరమేష్, పార్టీ సభ్యులు ఆయన్న, కార్యకర్తలు సిద్ధు, హనుమంతు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాజశ్రీ ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
ఎం.వి.ఓ పి. నంబర్ 67/2022

చాకలి వరలక్ష్మి వగైరా. ...అర్జీదారులు

(ఎదురి)

బెస్తా రామకృష్ణ పోతి వారసులు
బి.దూలయ్య వగైరా. ...రెస్పాండెంట్లు

1, 2 రెస్పాండెంట్లకు నోటీసులు

1) బి.దూలయ్య తండ్రి Not Known.
2) బి.లక్ష్మి భర్త బి.దూలయ్య
ఇద్దరు ఇంటి నెంబర్ 4-326 రామచంద్రానగర్, మంత్రాలయం గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబరు ఎం.వి.ఓ.పిలో సి.చిన్న గోపాల్ అను నతడు రోడ్డు ప్రమాదంలో 26/05/2022 వ తేదీన చనిపోయినాడు. అని అతనికి నష్టపరిహారముగా రూ 20,00,000/- లు అర్జీ దాఖలు చేసిన తేదీ నుండి 18% ప్రకారం వడ్డీతో, మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని అర్జీ దారులు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 1,2 రెస్పాండెంట్లు అయినా మీకు ఆక్షేపణ ఉన్న 19/10/2023వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టువారి ఉత్తర్వు మేరకు

డి. చెన్న నాయక్,
డి. మధుసుధన రావు,
ఎం.జగదీశ్వర బాబు,
ఆర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.

రాష్ట్రస్థాయి పోటీలకు నగరూరు విద్యార్థులు

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్రస్థాయి అండర్-14, 17 త్రోబాల్ పోటీలకు నగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. శనివారం నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీల్లో నగరూరు గ్రామానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు వరుణ్ తేజ, మేఘనలు అండర్-17 త్రో బాల్ విభాగంలో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. 9వ తరగతి చదువుతున్న అఖిల, 8వ తరగతి విద్యార్థి మనోజ్ అండర్-14 విభాగంలో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆస్పరి మండలం నగరూరు గ్రామం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి క్రీడలకు గుండ్లకొండ విద్యార్థి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని గుండ్లకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తేజస్ కుమార్ అండర్-14 బాలుర విభాగంలో బాల్ బ్యాడ్మింటన్‌కు జాతీయస్థాయి పోటీలకు రెండోసారి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నాగరాజు రావు, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.ఉచ్చీరప్ప తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థికి అభినందన సభ ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 14 నుంచి 18 వరకు చత్తీష్‌గడ్ రాష్ట్రంలోని బిలాయిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడలు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి దోహద పడతాయన్నారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో జావీద్, రామ్ చరణ్, నవనీత్ ఆచారి, ప్రవీణ్, బాలికల విభాగంలో సుస్మిత రాధిక పాల్గొన్నట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు హరికృష్ణ విద్యార్థులను తీర్చిదిద్దడంలో కృషి చేశారని తెలిపారు. ఉపాధ్యాయులు సలీం బాష, భువనేశ్వరి, దేవి మాలిని, రమేష్ కుమార్, కిరణ్ కుమార్, నూర్ అహ్మద్, సౌభాగ్యరాణి, సౌజన్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి, భద్రత శూన్యం

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్ర ప్రజలు కరువు కోరల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమం, భద్రత శూన్యమని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. సోమవారం చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో 30వ రోజు కౌతాళం మండలంలోని క్లస్టర్- 2, యూనిట్ బూత్ ఇన్‌ఛార్జీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పక్ష పార్టీల నాయకులు ప్రశ్నించకుండా ఉండేదుకే అక్రమంగా చంద్రబాబును జైలుకు పంపారని మండిపడ్డారు. టిడిపి అధికారం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. తెలుగు యువత జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయన, మండల నాయకులు అశోక్ రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప డేని, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరద్వాజ్ శెట్టి, క్లస్టర్-2 ఇన్‌ఛార్జీ కోట్రేష్ గౌడ్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు సాయిబాబా, రమేష్ గౌడ్, మల్లికార్జున రెడ్డి, చావిడి వెంకటేష్, విజయ రామిరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఉమర్ సాబ్, నియోజకవర్గ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, అబ్దుల్, చిన్నభూంపల్లి నరసింహులు, జంపాపురం కృష్ణారెడ్డి, ఆర్‌టిఎస్ కన్వీనర్ దశరథ రాముడు, ఎస్సీ సెల్ నాయకులు మారెప్ప, యోబు, ఉరుకుంద సర్పంచి సురేంద్ర, కోసిగి గోపాల్, ఐరన్‌గల్ శివ, వారం గోపాల్, బెళగల్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచి రామయ్య, రంగారెడ్డి, గోపాల్, గుండేష్, ఉసేని, మాలపల్లి చంద్ర, తెలుగు యువత కోసిగి మండల అధ్యక్షులు నాడిగేని మహదేవ్, కావలి ఈరప్ప, రామచంద్ర, చూడి సురేష్, ఐ టిడిపి సల్మాన్ రాజు, నీలకంఠ, ఉసేని, హనుమంతు, లింగప్ప పాల్గొన్నారు. **ఆదోని**లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 'బాబు కోసం మేము సైతమ'ంటూ టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి బోయ తేజ, ఆదోని నియోజకవర్గ అధ్యక్షులు బెస్త జయ సూర్య, ప్రధాన కార్యదర్శి బల్లేకల్ సూర్య, జగదీష్, రమేష్, నూర్, గణేష్, తాహేర్, అనిల్ సంఘీభావంగా రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో నీరు, నిధులు, నియామకాలు గాలికి వదిలేశారని విమర్శించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేదే లేదన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, నాయకులు రామస్వామి, రంగస్వామి నాయుడు, బుద్ధారెడ్డి, శివప్ప రామకృష్ణ, జయరాం, శివ, చిట్టిబాబు, బాలాజీ, సుధాకర్, మల్లికార్జున, వీరేష్, అయ్యన్న, లక్ష్మీనారాయణ, రంగన్న, బాబు నాయుడు, కృష్ణారెడ్డి, మహేష్, వెంకన్న, అంజి, గోవిందప్ప, ఎల్లప్ప, ప్రహ్లాద రెడ్డి, గోపాల్, హనవాళ్ మాబాష, సాధుల్లా, ఇంద్రనగర్ వలీ పాల్గొన్నారు. **నందవరం**లో ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు 'మేము సైతం బాబు కోసం' రిలే నిరాహార దీక్షకు టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్ హాజరయ్యారు. మండల కన్వీనర్ చిన్న రాముడు, టిడిపి నాయకులు తిప్పారెడ్డి, రెహమాన్, నాగప్ప, రఫీ, కిషోర్ పాల్గొన్నారు. **ఆలూరు**లో మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర నాయకులు నారాయణ రెడ్డి, నారాయణ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురువ జయరామ్, మండల కన్వీనర్లు అశోక్ యాదవ్, విజయ భాస్కర్ గౌడ్, ఉచ్చవీరప్ప, శేషగిరి, దేవేంద్రప్ప సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఒంటి కాలుపై నిలబడి నిరసన చేపట్టారు. జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, ఎంపిటిసిలు నరసన్న, సర్పంచి ఎల్లప్ప, టిడిపి సీనియర్ నాయకులు వెంకటస్వామి గౌడ్, రంగన్న, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, మల్కన్న, కాకి సీతయ్య, రాము యాదవ్, హరి, ఉమాకాంత్ స్వామి, మంగన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి


ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు


ఆలూరులో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

చంద్రబాబు అరెస్టు అక్రమం...

- టిడిపి మా కుటుంబానికి భవిష్యత్తునిచ్చింది
- టిడిపి టికెట్ ఆశించిన విషయం వాస్తవం
- వైసిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

చంద్రబాబు అరెస్టు అక్రమమంటూ వైసిపి నాయకులు, కెడిసిసి మాజీ ఛైర్మన్, బీసీ నాయకులు మాధవరం రామిరెడ్డి కుమారులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో వారి స్వగృహంలో నియోజకవర్గంలోని అనుచరులతో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు రాజకీయ కుట్రగా అభివర్ణించారు. రాజకీయాన్ని రాజకీయంగా ఎదుర్కోవాలే గానీ 73 ఏళ్ల వయస్సు గల వ్యక్తిని అరెస్టు చేయడం బాధాకరమన్నారు. వైసిపిలో ఉన్నప్పటికీ ఈ విషయంలో గత నెల రోజులుగా బాధపడుతున్నామని తెలిపారు. ఎన్‌టిఆర్ 1983లో టిడిపిని స్థాపించిన నాటి నుంచి రామిరెడ్డి కుటుంబం ఆ పార్టీలో కొనసాగుతూ వచ్చామని, తమ తండ్రి రెండు సార్లు ఎంపిపిగా, జడ్‌పిటిసిగా పని చేశామని చెప్పారు. సర్పంచిగా సుమారు 30 ఏళ్ల పని చేస్తూ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. ఆ పార్టీ వల్ల ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నామని చెప్పారు. అనివార్య కారణాల వల్ల 2019 ఎన్నికల్లో వైసిపిలో చేరామని, వైసిపి కూడా తమ తండ్రికి సముచిత స్థానం కల్పించి కెడిసిసి ఛైర్మన్ పదవి ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం వైసిపిలో తమ మాట చెల్లుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ నుంచి టిటిడి టికెట్‌ను ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, వాస్తవమా అని విలేకరులు ప్రశ్నించగా ఉండొచ్చని తెలిపారు. పార్టీలో అంతర్గత సమస్యలు ఉంటాయని, మద్దతుదారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు తన వర్గీయులతో కలిసి ఎన్‌టిఆర్, రామిరెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. రాఘవేంద్ర రెడ్డి కుమారుడు ఎన్.రాకేష్ రెడ్డి, ఎంపిటిసి ఈరన్న, సర్పంచి ఇందిరమ్మ, జుమ్మాలదిన్నె సర్పంచి హనుమంతు, జంపాపురం ఎంపిటిసి చిదానంద, కమ్మలదిన్నె మాజీ సర్పంచి వీరప్ప నాయుడు, వగరూరు మాజీ సర్పంచి ఏసన్న, నాయకులు వరదరాజు, బాబిరెడ్డి, మాలపల్లి లక్ష్మయ్య, వగరూరు వీరారెడ్డి, చెట్నేహళ్లి మేకల నరసింహులు నాగేష్, కంపాడు మునెప్ప పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మహారాజ శ్రీ ఆడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి : గద్వాల
జోగులాంబ గద్వాల జిల్లా.
ఇ.పి.నెం.29/2017 ఇన్ ఓ.యస్.నెం.52/2005

పులుసూరు సుదర్శన్ తండ్రి పి.శేషన్న,
ఇంటి.నెం.40/740-సి, ధర్మపేట,
కర్నూలు టౌన్. ...డి.హెచ్.ఆర్

-ఎదురి-

మద్దూరు వెంకట్రామిరెడ్డి డైడ్ బై ఇతని వారసులు.
...జె.డి.ఆర్స్

వేలం ప్రకటన

మద్దూరు వెంకట్రామిరెడ్డి డైడ్ బై ఇతని వారసులు
1.శ్రీమతి శారదమ్మ భర్త లేటు యం.వెంకట్రామిరెడ్డి, వయస్సు 59 సంవత్సరాలు.
2. యం.రాఘవేంద్రర్ రెడ్డి తండ్రి లేటు యం.వెంకట్రామిరెడ్డి, వయస్సు 26 సంవత్సరాలు.
3.యం.గిరీశ్వర్ రెడ్డి తండ్రి లేటు యం.వెంకట్రామిరెడ్డి, వయస్సు 24 సంవత్సరాలు.
ఆందరి నివాసం చాగా పురం గ్రామము, ఇటిక్యాల మండలం, ప్రస్తుతం అందరి నివాసం ఉండే ప్రాంతము, నిడ్జూరు గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.

యం.వెంకట్రామిరెడ్డి, గారు చేసిన అప్పుకుగాను కోర్టు ద్వారా ఈ క్రింది ఉదాహరించిన జె.డి.ఆర్స్ యొక్క అనుభవంలో ఉండి వ్యవసాయం చేయుచున్న భూమి మరియు ఎగ్జిక్యూషన్ పిటిషన్ క్రింది షెడ్యూలు దాఖలు చేయబడిన భూమిని పై కోర్టువారు తేది 25-10-2023 ఉదయం 10.30 గంటలకు వేలం వేయుటకు కోర్టు వారు నిర్ణయించినారు. కావున కావలసిన వారు వేలం పాటలో పాల్గొనవచ్చును.
దిగువ షెడ్యూలు భూమిపై ఎలాంటి అన్యాక్రాంతము చేయలేదు. మరియు జె.డి.ఆర్స్. వ్యవసాయం చేస్తూ తన అధీనంలో ఉన్న భూమి జోగులాంబ గద్వాల జిల్లా, చాగాపురం గ్రామం,ఇటిక్యాల మండలం, అలంపూర్ సబ్-రిజిస్ట్రేషన్ అఫీస్ పరిధిలో గల భూమి హద్దులు: ఈ యొక్క భూమిని యలగమాన్ చేను అంటారు. సర్వే నెం.331/ఏ-1, ఎకరములు : ఏ.5-13 గుంటలు.

హద్దులు:
తూర్పు : యమ్.రామిరెడ్డి పొలం.
పడమర : చిన్న నాగిరెడ్డి పొలం.
ఉత్తరం : పెద్దనాగిరెడ్డి పొలం
దక్షిణం : బాపిరెడ్డి పొలం.

వేలం వేయు తేది : 25-10-2023
D.Hr **మదింపు ఎకర రూ.50,000/-**

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 25-10-2023

కె.ఆనందరావు
బి.రాజేష్‌కుమార్,
అడ్వకేట్స్ ఫర్ జె.డి.ఆర్స్,
గద్వాల.





మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పేదలందరికీ మెరుగైన వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి పేదవాడికి రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన లక్ష్యమని ఐటీ సెక్రటరీ, జిల్లా స్పెషల్ అధికారి కోన శశిధర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని వెలుగోడు, నంద్యాల పట్టణంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై సంబంధిత మెడికల్ అధికారులు, నియోజకవర్గ స్పెషల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో గుర్తించిన రోగులకు వైద్య పరీక్షల నిర్వహణ నామకేవాస్తి చేశామన్న రీతిలో కాకుండా నాణ్యతగా నిర్వహించి చికిత్సలు అందించాలన్నారు. శిబిరాల్లో పెద్ద వ్యాధులకు గురైన బాధితులను రెఫెరల్ ఆస్పత్రులకు పంపడమే కాకుండా వాటిని ఫాలో అప్ చేసే బాధ్యతను డాక్టర్లు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని సూచించారు. అర్బన్, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో అధిక స్థాయిలో క్యాంపులు నిర్వహించడంతోపాటు నిపుణులైన వైద్యులను కూడా క్యాంపులకు రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. ఇళ్లకు తాళం వేసిన కుటుంబీ కులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాలకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టు శిబిరాల్లో ఫ్యాన్లు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శిబిరాల సమీపంలో 108 అంబులెన్స్ వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు టెస్టులకు అవసరమైన కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని డాక్టర్లకు సూచించారు. కంటి వెలుగు కింద కాంటాక్ట్ ఆపరేషన్లు చేయడానికి చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలలో 128, అర్బన్ ప్రాంతాలలో 7 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరాల్లో 58,000 మంది ఓపి నమోదైనట్లు వివరించారు. దీర్ఘకాలిక రోగులను రెఫెరల్ హాస్పిటల్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. 15 రోజులు ముందే ఇంటింటి సర్వే నిర్వహించి సంబంధిత రోగుల డేటాను సేకరించి వైద్య శిబిరాలకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకట రమణ, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫరూళ్ళ, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, అన్ని నియోజకవర్గాల స్పెషల్ అధికారులు, మెడికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు పేరుతో
పొలాన్ని ఆక్రమించుకున్నాడు..

- న్యాయం చేయాలని బాధిత మహిళా రైతు విన్నపం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'రుద్రవరం మండలం పేరూరు గ్రామంలో సర్వే నంబర్ 757/3లో నాకు 3.50 ఎకరాల భూమి ఉంది. ఈ పొలాన్ని నాగిరెడ్డిపల్లెకు చెందిన ఒక వ్యక్తి కౌలుకు తీసుకున్నాడు.. కానీ అతను నా భూమిని దౌర్జన్యంగా పూర్తిగా ఆక్రమించుకుని పొలం నాదే అంటున్నాడు.. ఆన్‌లైన్‌లో, పట్టాదారు కాగితాలను పరిశీలించి న్యాయం చేయండి' అంటూ బాధిత మహిళా రైతు ఎల్లమ్మ స్పందన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం-స్పందన విజ్ఞప్తులపై వెంటనే స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను సూచించారు. స్పందన కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా తీసుకొని లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెద్ద ఎత్తున చేస్తున్న ఈ కార్యక్రమంలో ఫలితాలు కనపడాలని ఆదేశించారు. నిబంధనల మేరకు అర్జీదారుల సమస్యలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్ పరిష్కరించే అధికారి లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు 24 గంటల్లో సమ్మతి అధికారికి చర్య నిమిత్తం అసైన్ చేయడంలో అశ్రద్ధ వహించిన డేటా ఆపరేటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

వినతులలో కొన్ని...

- 'నేను వికలాంగుడి. నా భార్య చనిపోయింది. నాకు ఒక కుమార్తె ఉంది. జీవనం సాగడం ఇబ్బందికరంగా వుంది. నాకు ఏదైనా ఉద్యోగం లేదా ఉపాధి కల్పించండి' అంటూ గోస్పాడు మండలం జూలేపల్లి గ్రామ వాసి నరసింహ జిల్లా రెవెన్యూ అధికారి వారికి దరఖాస్తును సమర్పించాడు.

- 'నాకు 63 సంవత్సరాలు ఉన్నా వృద్ధాప్య పెన్షన్ రావడం లేదు. నాకు ఎటువంటి ఆధారం లేదు. నాపై దయవుంచి నాకు పెన్షన్ ఇప్పించి ఆదుకోండి' అని రుద్రవరం మండలం వెలగపల్లె గ్రామ నివాసి బద్రి బాల వెంకటన్న అర్జీ అందజేశాడు.

ఈ కార్యక్రమంలో మొత్తం 184 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, అన్ని శాఖల జిల్లాధికారులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య సాగునీటి వివాదం

- వారం రోజులుగా నడుస్తున్న వైనం
- జడ్పిటిసి వ్యాఖ్యలపై రైతులు ఆగ్రహం
- తెలుగు గంగ అధికారులకు ఫిర్యాదు - పరిశీలన



వివాదంగా మారిన తెలుగు గంగ కాల్వ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలంలోని రెండు గ్రామాల మధ్య గత వారం రోజుల నుండి నీటి వివాదం నెలకొంది. దీనికి తోడు జడ్పిటిసి మహేశ్వర రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు గంగ ప్రధాన కాలువ నుండి 10వ బ్లాక్ ద్వారా తిమ్మాపురం, అబ్బీపురం, పుట్టుపల్లె, బొల్లవరం గ్రామాలకు చెందిన పంట పొలాలు దాదాపు 250 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. మిగిలిన నీరు వాగులు, వంకల ద్వారా సమీపంలోని చెరువులకు చేరుతుంది. ఈ సాగునీరు కొంత భాగం తమ్మడపల్లె పంట పొలాలకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదే అదునుగా భావించిన ఆయన పదవ బ్లాక్ నుండి సాగునీటిని అక్రమంగా తరలించటానికి పిల్ల కాలువల ద్వారా వివిధ మార్గాల వైపు వెళ్లడానికి అవకాశం ఉన్న ప్రధాన కూడలిలో ఒకచోట అడ్డుకట్టను జడ్పిటిసి తన అనుచరవర్గంతో తొలగించడంతో వివాదం నెలకొంది. గత ఏడాది తమ్మడపల్లె గ్రామ రైతుల పంట పొలాలకు సాగునీటి కోసం 11వ బ్లాక్‌ను ఆధునీకీకరణ చేపట్టి సాగునీటి ఇబ్బందులు లేకుండా స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చొరవతో సమస్యను పరిష్కరించుకున్నారు. కానీ ఇప్పుడు పదవ బ్లాక్ నుండి కూడా నీటిని అక్రమంగా తరలించుకుపోతే పంటలు పండించుకునేది ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే జడ్పిటిసి తన అనుమతి లేకుండా తొలగించిన అడ్డుకట్టను అధికారులు మళ్లీ ఏర్పాటు చేస్తే వారిని ఇంటికి పంపిస్తానని పేర్కొనడం వివాదాస్పదంగా మారింది. ఇతర గ్రామాల రైతులు తమ పొలాలకు సాగునీరు రాకుండా అడ్డుకట్ట వేసి నీటిని వాడుకోవడంతో తొలగించడానికి చర్యలు తీసుకున్నానని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కాలువల నిర్మాణ సమయంలో అధికారులు ఏర్పాటు చేసిన దిమ్మలను తొలగించారు. మళ్లీ రైతులు కొంత మొత్తంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దానిని కూడా తొలగించడంతో రైతులు తెలుగు గంగ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని తెలుగు గంగ డిఈ నాగ మధుసూదన రావు, ఏఈ జగదీష్ కుమార్ పరిశీలించారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. ఈ సందర్భంలోనే జడ్పిటిసి ఫోన్ ద్వారా సంప్రదించగా పై వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదంగా మారింది. ఏదైనా సమస్య ఉంటే అధికారులకు తెలియజేసి పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధి అధికారులను సస్పెండ్ చేయిస్తానని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రజాప్రతినిధి అధికార పార్టీకి చెందిన నేత కావడంతో అధికారులు రైతులకు అప్పటికి న్యాయం చేస్తామని చెప్పి వెళ్లిపోవడం శోచనీయం.

ఇల్లు రాసివ్వాలని...
కుమారుడు హింసిసున్నాడు

- పోలీస్ స్పందనలో వృద్ధ తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'నా రెండవ కుమారుడు జి.ఖాజా హుస్సేన్ అతని భార్య కరిమూన్ నన్ను, నా భర్తను ఇల్లు రాసివ్వాలని దూషిసూ, హింసిస్తున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు.. నాకు న్యాయం చెయ్యండి' అని బనగానపల్లికి చెందిన జి.నజీమూన్నీసా జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేశారు. సోమవారం నంద్యాలలోని బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఫిర్యాదిదారుల నుంచి మొత్తం 135 ఫిర్యాదులను ఎస్పి స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పి అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులలో ఎక్కువగా సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్థి పంపకాలలో మనస్పర్థలు మొదలగునవి ఉన్నాయి.

ఫిర్యాదులలో కొన్ని....

- 'నేను కోవెలకుంట్లలోని జిసిఆర్ కాంప్లెక్స్‌లోని ఎటిఎంలో డబ్బులు తీసుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి నన్ను మాటల్లో పెట్టి నా ఎటిఎం కార్డును మార్చి వేరే ఎటిఎం కార్డును ఇచ్చారు. నా ఎటిఎం కార్డుతో ఆగష్టు 26, 27న రూ. 68,500 డ్రా చేసుకున్నారు. నాకు న్యాయం చెయ్యండి' అని బిజినవేములకు చెందిన శ్రీనివాస కాలేజీ లెక్చరర్ జి.మాబు హుసేన్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

- 'ఫ్లాట్ల వ్యాపారం చేసుకుందామని శిల్పానగర్‌కు చెందిన శ్రీవల్లి, మనోజ్‌లు కలిసి నా వద్ద నుండి రూ. 30 లక్షలు తీసుకొని నాకు తెలియకుండా ఇళ్ల స్థలాలు కొని వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నా డబ్బులు నాకివ్వమని అడుగగా ఇవ్వమని, ఏవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని, మళ్ళీ డబ్బులు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నారు. నాకు న్యాయం చేయండి' అని పొన్నాపురంకు చెందిన ఎం.వరదరాజు ఫిర్యాదు చేశాడు.

- 'నా పొలం సాగు చేసుకుంటుండగా ఈ భూమిపై మాకు హక్కు ఉందంటూ కొందరు వ్యక్తులు పంటను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. నాకు న్యాయం చేయాండి' అనిబండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామానికి చెందిన రైతు చిన్న స్వామి ఫిర్యాదు చేశాడు. స్పందకు వచ్చిన ఫిర్యాదిదారులకు ఓంకారం ధేవస్థానం వారు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచి డిఎస్‌పి జెవి సంతోష్ పాల్గొన్నారు.

వివోఎల సమస్యలపై నేడు 36 గంటల ధర్నా

- జయప్రదం చేయండి : వెలుగు విఒఎల సంఘం

ప్రజాశక్తి - నంద్యాల : ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేడు, రేపు 36 గంటల పాటు నిర్వహించే ధర్నా, వంటా వార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపి వెలుగు వివోఏల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న తిరుపతయ్యలు కోరారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివోఏల సమస్యలు పరిష్కారం చేయకుండా గత నాలుగు సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా వివోఏల సమస్యలను పరిష్కరించాలని, రాబోయేది ఎన్నికల కాలమేనని గుర్తు పెట్టుకోవా లన్నారు. డిమాండ్ల సాధన కోసం నంద్యాల జిల్లాలోని వివోఏలంతా 36 గంటల ధర్నా, వంటవార్పులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



డిప్యూటీ సిఎంకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఇఒ పెద్దిరాజు

దసరా మహోత్సవాలకు ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల దేవస్థానంలో వైభవంగా జరగనున్న దసరా మహోత్సవాలకు రావాలని ఉప ముఖ్యమంత్రి దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్య నారాయణను శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం నాడు ఇఒ లవన్న మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి వస్త్రాప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగే దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు. ఈ నెల 15 నుండి దసరా ఉత్సవాలు ప్రారంభమైతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడు తాలేపల్లి నాగేంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ సన్నిధి శ్రీనివాసులు, పెండేకంటి సంతోష్, రావూరి ప్రసాదు, సన్నిధి శివ, పసుపుల ప్రసాద్, గుంటూరు శివ,నరేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికల బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఆర్య వైశ్యులు

కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బ్రిటీష్ కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదింపు చేసి కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా పెట్టుబడుదారులకు, కార్పొరేట్ సంస్థలకు నయా బానిసలుగా చేసే విధానాలను అనుసరిస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి ఉద్యోగులకు భద్రతా లేకుండా చేస్తుందని తెలిపారు. నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విద్యుత్ డిస్కములను ప్రైవేటుపరం చేయడం ద్వారా విద్యుత్ చార్జీలను భారీగా పెంచి వేస్తూ ప్రజలపై మోయలేని భారాలను వేస్తుందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం బిజెపి విధానాలను తూచా తప్పకుండా పాటిస్తూ కుడిచేత్తో నవరత్నాలను ఇస్తూ ఎడమచేత్తో బారాల పేరుతో లాక్కుంటుందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం ప్రతిపాదనకు వంత పాడుతుందని, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులను తీసుకురావడంలో ఘోరంగా విఫలమైందని చెప్పారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. అంగన్వాడీ, ఆశ, మున్సిపల్, మధ్యాహ్న భోజన, వెలుగు విఒఎ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడం లేదని తెలిపారు. కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేసి, కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేవారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు కార్మికులందరినీ సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శిలు లక్ష్మణ్ వెన్న బాల వెంకట్, పి వెంకట లింగం, రామ్ నాయక్, నిర్మలమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు

పంచాయతీల అభివృద్ధికి కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని 21 గ్రామపంచాయతీలలో 2022-23 సంవత్సరానికి సంబంధించి సౌకర్యాలు, వసతులు, జనన మరణాలు తదితర అంశాలపై సర్వే ఆధారంగా ప్రణాళికలను రూపొందించుకొని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉందని ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంచాయతీలలో సౌకర్యాలు, వసతుల (పంచాయతీ డెవలప్మెంట్ ఇండెక్స్) పై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపిఓ సూచనల మేరకు మండలంలోని గ్రామాలకు సంబంధించి పంచాయతీ డెవలప్మెంట్ ఇండెక్స్ గురించి మండల స్థాయి అధికారులందరితో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో మొత్తం 22 శాఖలకు సంబంధించి 9 థీమ్స్ 144 టార్గెట్స్, 577 ఇండికేటర్స్ ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి గ్రామపంచాయతీలలో సౌకర్యాలు వసతులు కల్పించేందుకు సర్వే చేపట్టేందుకు ఫెసిటేటర్‌ను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్, ఈవోపీఆర్డి శ్రీనివాసలుశర్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహశీల్దార్



బాధ్యతలు చేపట్టిన ఎస్సై విష్ణు నారాయణ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - అవుకు : మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పై విష్ణు నారాయణ హెచ్చరించారు. సోమవారం అవుకు పోలీస్టేషన్లో ఎస్ఐగా ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గుట్కా, జూదం, నాటు సారాయి, బెల్టు షాపులు తదితర వాటిని దూరంగా ఉండాలన్నారు.

నైపుణ్య శిక్షణ ధ్రువ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త యూనిట్ ధనలక్ష్మి ధ్రువపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ హనుమంతరాయ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఏవో సురేష్ కుమార్, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు కెవి రమణయ్య, ఎం.సుధాకర్, డి.బాలరాజు, ఏ.కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవి గౌడ్, లక్ష్మీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది రాక్షస పాలన : అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రాష్ట్రంలో రాజన్న రాజ్యం కాదు.. రాక్షస పాలన సాగుతుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు నమ్మి వైసిపికి ఓట్లు వేస్తే నేడు నరకం చూపిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు చేసింది గోరంతా కాగా పిచ్చి నిర్ణయాలతో నష్టం చేస్తున్నది కొండంత అన్నారు. ఆళ్లగడ్డ అభివృద్ధిపై ఎమ్మెల్యేతో ఎక్కడ చర్చ జరిపేందుకైనా తాము సిద్ధమన్నారు. ఆళ్లగడ్డకు 50 పడకల ఆసుపత్రి సాధించింది తామే అన్నారు. భూమా కుటుంబం చేసిన అభివృద్ధిని తాను చేసినట్టు ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకోవడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఆళ్లగడ్డలో కమీషన్ రాజకీయాలు జరుగుతున్నాయని అన్నారు. ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగరవేయడమే కాక నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేసి పార్టీని గెలిపిస్తానన్నారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని చెబుతున్న ఈ ప్రభుత్వం ఇంటికి లక్ష రూపాయలు ఇచ్చి పన్నుల, అధిక ధరల రూపేణా అంతకు రెట్టింపు వసూలు చేస్తుందన్నారు. ప్రజల్ని మోసం చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చాంద్ బాష, సల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని రావుస్ గర్ల్స్ కాలేజీలో రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల,ఉదయానంద కార్కినోస్ టీమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌పై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల అధ్యక్షులు దండే దస్తగిరి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ తరపున రూ. 60 లక్షలతో ఉదయానంద హాస్పిటల్‌లో క్యాన్సర్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందస్తు జాగ్రత్తలు, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఉంటే బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌ను జయించవచ్చని తెలిపారు. విలువైన సమయాన్ని వెచ్చించి విద్యార్థినిలకు బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడానికి తోడ్పడిన ఉదయానంద హాస్పిటల్ వైద్యులను అభినందించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వాణి, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ మహిళలు ఎలాంటి అపోహలు పడకుండా అప్పుడప్పుడు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ గురించి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. డాక్టర్ వివి సుబ్బారెడ్డి, క్లినికల్ ఆపరేషన్స్, డాక్టర్ చేతన సీనియర్ మేనేజర్ పాల్గొని విద్యార్థినీల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ సంగమేష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల, ఉదయానంద హాస్పిటల్ వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు దండే దస్తగిరి


తాసిల్దార్ వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

పేదల భూములకు చట్టబద్ధత కల్పించాలి : వ్యకాసం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని ఏ కోడూరు గ్రామంలో 50 సంవత్సరాలుగా పేదలకు ప్రభుత్వ భూములు ఇవ్వడం జరిగిందని ఈ భూముల అనుభవిస్తున్న కుటుంబాలకు ఇంతవరకు చట్టబద్ధత కల్పించకపోవడం తీవ్ర అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సోమవారం బండి ఆత్మకూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఏ కోడూరు గ్రామ పేద రైతులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు 50 సంవత్సరాలుగా అనుభవిస్తున్న ప్రభుత్వ పోరంబోకు భూములకు చట్టబద్ధత కల్పించి ఆన్లైన్లో ఎక్కించి వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకుడు రామచంద్రుడు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి డేవిడ్ మాట్లాడుతూ పేదల భూములకు హక్కులు కల్పించడంలో ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు విఫలమయ్యారని అన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పేద రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు శిక్షణ


రాష్ట్రస్థాయికి ఎంపికైన ఖోఖో జట్టుతో ఖోఖో చైర్మన్, సిబ్బంది

ప్రజాశక్తి - పగిడ్యాల

మంగళవారం నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాలకు ఎంపికైన జట్టుకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, అధ్యక్షులు శంకర్, సెక్రెటరీ ప్రభాకర్ తెలిపారు. గత రెండు రోజుల నుంచి పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో రాష్ట్రస్థాయి ఖోఖో జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించారు. సోమవారం రాష్ట్రస్థాయికి తుది జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 19 నుంచి చిత్తూరు జిల్లా యాదమర్రిలో రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా తరఫున ఖోఖో జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఖోఖో జట్టుకు పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం నుండి రాష్ట్రస్థాయి పోటీలలో తలబడేందుకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. జట్టుకు మంచి శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయిలో విజయకేతనం ఎగిరే విధంగా శిక్షణ ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయులను వారు కోరారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఖోఖో జట్టుకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాశ్రీ తోకల పీతాంబ రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఇరిగెలను ఆహ్వానించిన ఆర్యవైశ్యులు


ఆహ్వానపత్రికను అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అమ్మవారి శాలలో జరుగు దసరా శరన్నవరాత్రుల మహోత్సవం ఆహ్వాన పత్రికను వైసిపి తాలూకా సీనియర్ నాయకులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డికి ఆర్యవైశ్యులు అందించారు. సోమవారం అమ్మవారి శాల అధ్యక్షులు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ఇరిగెల స్వగృహానికి వెళ్లి అహ్వాన పత్రికను అందించి నవరాత్రుల కార్యక్రమానికి హాజరుకావాలని ఇరిగెల సూర్యనారాయణ రెడ్డిని కోరారు.

కృష్ణా జలాల వినియోగంపై నూతన జిఒను ఉపసంహరించుకోవాలి : బొజ్జా

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర సాగునీటి హక్కులను హరించివేసే దిశగా భారతీయ జనతా పార్టీ దూకుడును అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించడానికి రాజ్యాంగం, అంతర్ రాష్ట్ర జల వివాదాల చట్టం 1956 ప్రకారం బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టాలను పాలకులు ఏర్పాటు చేస్తే అదే పాలకులు ఈ చట్టాలను తూట్లు పొడుస్తూ, రాష్ట్రాల మధ్య వివాదాలు సృష్టించైనా సరే కేవలం తమ రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఈ నెల 7న విడుదల చేసిన జీవోను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు కొమ్మా శ్రీహరి, మహేశ్వరరెడ్డి, పట్నం రాముడు, భాస్కర్ రెడ్డి, షణ్ముఖరావు, క్రిష్ణమోహన్ రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ నందు గురువారం నాడు జువ్వాజి సుంకన్న సేవాసమితి ఆధ్వర్యంలో స్కానింగ్ నిమిత్తం వివిధ గ్రామీణ ప్రాంతాల నుండి ప్రభుత్వ హాస్పిటల్‌లకు వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు, పేషెంట్లకు గిరిజాదేవి అన్నదానం నిర్వహించారు. జువ్వాజి సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య హాజర య్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జువ్వాజీ సుంకన్న సేవా సమితి ప్రతి నెల అన్నదానం చేయడం సంతో షంగా ఉందన్నారు. తానూ సేవా సమితి వెన్నంటి సహ కారం అందిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో గిరిజాదేవి, సుధాకర్ రెడ్డి, శ్రీధర్, ధరణి, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న దృశ్యం

రుద్రవరం మండలంలో బాల్యవివాహాలు

- ఏడాదికేడాది పెరుగుతున్న వైనం
- తగ్గుతున్న బాలికల చదువు
- పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని పలు గ్రామాలలో బాల్య వివాహాలు ఏడాదికేడాది పెరుగుతున్నాయి. బాల్య వివాహాల నిరోధకానికి ఏర్పాటు చేసిన కమిటీలు సక్రమంగా పని చేయకపోవడంతో ప్రతి ఏడాది పదుల సంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి ఏడాదికి దాదాపు 40 దాకా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. బాల్య వివాహాలను నిరోధించడానికి బాల్యవివాహాల నిరోధక కమిటీలను ప్రతి సచివాలయ పరిధిలో అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సర్పంచి చైర్మన్‌గా, కన్వీనర్‌గా మహిళా పోలీస్, కమిటీ మెంబర్లుగా పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామ ఐక్య సంఘం సభ్యురాలు, వార్డు మెంబర్, హెల్త్ అసిస్టెంట్, అంగన్‌వాడి కార్యకర్త, ఎన్జీవో, మహిళ యాక్టివ్ నెంబర్ మొత్తం 11 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా అక్కడికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలి. బాల్య వివాహాలు జరగడం వల్ల కలిగేనష్టాలు, ఇబ్బందులు, బాలికల భవిష్యత్తు గురించి తెలియజేసి బాల్య వివాహాలు జరగకుండా నిరోధించాల్సి ఉంది. అయితే ఈ కమిటీలు సక్రమంగా పని చేయకపోవడంతో మండలంలో బాల్య వివాహాలు యధావిధిగా జరుగుతూనే ఉన్నాయి. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల లేకపోవడం, మాతా శిశు మరణాలు సంభవించడం, పుట్టిన బిడ్డలు అంగవైకల్యంతో పుట్టడం, కాన్పు సమయంలో మరణాలు సంభవించడం జరుగుతున్నాయి. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలు విద్యలో వెనుకబడడం, లింగ నిష్పత్తిలో వ్యత్యాసాలు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాలను నేరంగా ప్రకటించి 2006 చైల్డ్ మ్యారేజెస్ యాక్ట్ జీవో 31 రూల్స్ 2023 ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. అయితే బాల్య వివాహాల నిరోధక కమిటీలు సక్రమంగా పని చేయకపోవడంతో బాల్య వివాహాలు యధావిధిగా జరుగుతున్నాయి. రుద్రవరం మండలంలోని ముత్తలూరు గతేడాది 5 , మండల కేంద్రం రుద్రవరంలో ఇటీవల 3 బాల్య వివాహాలు జరిగాయి. ఈ విషయంపై గత నెల 26న జిల్లా న్యాయస్థానంలో ఫిర్యాదు అందినట్లు తెలిసింది. దీంతో జిల్లా న్యాయస్థానం ఈ విషయంపై సీరియస్‌గా స్పందించి ఆ గ్రామాలకు జిల్లా కమిటీలను పంపినట్లు సమాచారం. బాల్య వివాహాల నిరోధించడంలో ఐసిడిఎస్ అధికారుల పాత్ర ఎక్కువ ఉండాల్సి ఉంది. అయితే సంబంధిత ఐసిడిఎస్ అధికారులు బాల్యవివాహాలపై చర్యలు తీసుకోకపోవడంతో మండలంలో బాల్య వివాహాలు యధావిధిగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాల్య వివాహాలను నిరోధించి బాలికల విద్య అభివృద్ధి, వారి ఎదుగుదలకు దోహదపడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాబు విడుదలయ్యే వరకూ ఉద్యమం : టిడిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జైలు నుంచి విడుదల అయ్యేంతవరకు తమ ఉద్యమం ఆగదని మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ అన్నారు. బాబు గారికి తోడుగా మేము సైతం అంటూ సోమవారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఆమె సంఘీభావం తెలియజేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే వైసిపి ప్రభుత్వం రాజకీయంగా అరెస్టు చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, ఎయిర్టెల్ శేఖర్ రెడ్డి, సల్లా నాగరాజు, హర్షవర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జమాల్ బాషా, కసినేని ఓబులేసు, టైలర్ భాష తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని టిడిపి కార్యాలయ సమీపంలో ఉప్పర సంఘం నాయకులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. నాయకులు పెద్దరాజుపాలెం భూషన్న, చిన్న రాజుపాలెం నరసింహులు, వేములపాడు గుర్రప్ప, మద్దిలేటి స్వామి, రామ మద్దిలేటిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు దీక్ష నిర్వహించారు. దీక్షలో పాల్గొన్న నాయకులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పక్కిరారెడ్డి, టిడిపి నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. **నంద్యాల రూరల్ :** చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాలలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా సాగుతున్న దీక్షల్లో 27వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్వర్ణకారులు, పద్మశాలీలు, తొగట శాలీలు, కుర్ని శాలీలు, దేవాంగ శాలీలు, 39 వార్డ్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షలో పాల్గొన్న వారికి టిడిపి నంద్యాల పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్ అహ్మద్, 18 వార్డ్ టీడీపీ ఇంఛార్జి రాంపల్లె రామి రెడ్డి, ఎంఎన్‌సి ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ మహబూబ్ వలిలు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. 39వ వార్డ్ టిడిపి ఇంఛార్జి జాకీర్ హుస్సేన్, సేపురి ప్రసాద్, ఆదినారాయణ, ఇస్మాయిల్ అలీ, అల్లా మాలిక్ జాకీర్, జయరాముడు, క్రిష్ణ, జనార్దన్, శివయ్య ఆచారి, శంకర్, శ్రీధర్, బలరాం, సత్తార్, గౌస్, అరిఫ్ బాషా, అజీస్, స్వర్ణకారులు, పద్మశాలీలు, తొగట శాలీలు, కుర్ని శాలీలు, దేవాంగ శాలీలు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** రాష్ట్ర వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ అన్నారు. సోమవారం నందికొట్కూరు మండల పరిధిలోని కొణిదెల గ్రామంలో టిడిపి చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జయ సూర్య, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి,, గని, అడ్వకేట్ నాగముణి, ఖలీల్ బేగ్, ముర్తుజావలి, జయకర్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను నిరసిస్తూ ఆత్మకూరు పట్టణంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం కొనసాగాయి. దీక్ష చేపట్టిన టిడిపి శ్రేణులకు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ చంద్రబాబునాయుడు అరెస్టును ఖండిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడుపై కేసులు ఎత్తివేసేంతవరకు ఆందోళన కొనసాగి స్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శివరామిరెడ్డి, సీనియర్ న్యాయవాది గోవింద రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, న్యాయవాదులు గిరి రాజు, కేశవ రెడ్డి, వెంకటేశ్వర్లు, పసుపులయ్య, రవి, మహబూబ్ బాషా, నాయకులు రాజేంద్ర రెడ్డి, నగుర్ ఖాన్, సి.కలిముల్లా, రమేష్ గౌడ్, నరసయ్య, సుబ్బయ్య, రముర్ధి, సతీష్, రాహం తుళ్ళా, నబీ, అమ్రుల్లా తదితరులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డ : దీక్షలో కూర్చున్న వారికి మద్దతు తెలుపుతున్న అఖిల ప్రియ


మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్

జీతాల కోసం ప్రతినెలా ఎదురుచూపులే : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉద్యోగ ఉపాధ్యాయులు గత కొన్ని నెలలుగా జీతాల కోసం ప్రతి నెలా 10 నుండి 15వ తేదీ వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి వస్తుందని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో మండల అధ్యక్షులు జె. వెంకటకృష్ణుడు అధ్యక్షతన జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 1వ తేదీ జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ నెల 10వ తేదీ కావస్తున్నా చాలా మంది ఉద్యోగ, ఉపాధ్యాయ ,పెన్షనర్లకు ఇంతవరకు జీతాలు జమ కాకపోవడం అన్యాయమన్నారు. సకాలంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019 నుండి ఫెయిల్ అయిన పదవ తరగతి విద్యార్థులకు సప్లమెంటరీ ఎగ్జామ్స్ రాయుటకు ఫీజు చెల్లింపును ప్రతి ఒక్క విద్యార్థి చెల్లించేలా హెచ్ఎం చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారని, ఒకవేళ విద్యార్థులు చెల్లించకపోతే హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రభుత్వమే ఎటువంటి ఫీజు చెల్లించకుండా విద్యార్థులు పరీక్ష రాసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పాఠశాలల నిర్వహణకు నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.మధుసూదన్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ వి.సుబ్బరాయుడు, నాయకులు కె.రమేష్, కె.శేఖర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టీఎస్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

పోస్టల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పోస్ట్‌మాస్టర్ ప్రభాకర్ రెడ్డి, ఏఐపిఈయు గ్రూప్ సి డివిజనల్ కార్యదర్శి మనోజ్‌కుమార్ కోరారు. సోమవారం చాగలమర్రి పట్టణంలోని తపాల శాఖా కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో తమ సమస్యలను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపి సర్కిల్ పరధిలో మూసి వేయబడిన 30 పోస్టాఫీస్‌లను వెంటనే తెరవాలని డిమాండ్ చేసారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్‌లను వెంటనే చెల్లించాలన్నారు. కార్యాలయాల్లో వాడే సిస్టమ్స్, ప్రింటర్స్, మరమ్మతులకు గురైనప్పుడు సిబ్బందికి ఇబ్బంది లేకుండా సర్వీసులు అందుబాటలో ఉండేలా చూడాలన్నారు. టార్గెట్స్ పేరిట ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురి చేయకుండా ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు వెంకటేష్ నాయక్, శ్రీనివాసులు, రవి,వెంగళరెడ్డి లు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

సుండిపెంట గ్రామంలో భగత్ సింగ్ కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని సున్నిపెంటలో తాసిల్దార్ రాజేంద్ర సింగ్‌కు సిపిఐ ఎంఎల్ ప్రజాపంద, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంద జిల్లా అధికార ప్రతినిధి వై. ఆశీర్వాదం, ఐఎఫ్టియు మండల అధ్యక్షుడు వై. శ్రీను మాట్లాడు తూ భగత్ సింగ్ కాలనీలో దాదాపు 100 కుటుంబాల వారు స్మశానం పక్కన జీవిస్తున్నారని, కాలనీలో వర్షాలు వస్తే చాలు పాములు, తేళ్ల విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని అన్నారు. రోడ్డు సరిగా లేక పోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆ రోడ్లను సర్వే చేసి తర్వాత వదిలేస్తున్నారని, అధికారులు అడిగితే కచ్చితంగా రోడ్డు వేస్తామని చెప్తున్నారే తప్ప ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు మండల కార్యదర్శి పి. మల్లికార్జున, ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్. కే. బాబు,సమద్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

నియోజకవర్గ సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే

- భూమా కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నా ఎమ్మెల్యే గంగుల పట్టించుకోవడం లేదని బిజెపి తాలూకా ఇన్చార్జి భూమా కిషోర్ రెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొంటున్నామని, గ్రామాల్లో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. గడప గడపకు వెళ్తున్న ఎమ్మెల్యేకు సమస్యలు కనబడడం లేదా అని ప్రశ్నించారు. కొన్ని గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో రోడ్లు బురదతో కూరుకుని పోయాయన్నారు. ఆళ్లగడ్డ పర్యటనకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ. 100 కోట్లు నిధులు మంజూరు చేశారని, ఆ నిధులతో పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ప్రతి సచివాలయానికి నిధులు మంజూరు చేస్తున్నారని, ఆ నిధులతో ఏ పనులు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆయన ఇంటి రోడ్డు తప్ప ఏది వేయలేదని ఆరోపించారు. ఒకవైపు మీదందా, మరోవైపు మాజీ మంత్రి దందాతో ఆళ్లగడ్డ ప్రజలు బెంబేలు ఎత్తుతున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి సచివాలయానికి వెళ్తానని, ఆ సమస్యలను మీ దృష్టికి తెస్తామని, ఇప్పటినుండి అయినా వాటిని పరిష్కరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో సింగం భరత్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూమా కిషోర్ రెడ్డి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పిటిసి, ఎంపీపీ, సర్పంచ్

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఈ ఓ ఆర్‌డి నాగేంద్రయ్య, జడ్పిటిసి రామ్మోహన్ నాయుడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సేవాగుణం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - బేతంచెర్ల

సమాజంలో కులాలకు, మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ సమాజానికి సేవ చేసే గుణం అలవర్చుకోవాలని లైన్స్ క్లబ్ అధ్యక్షులు కల్కిసతీష్ కుమార్, జిల్లా చైర్మన్ మారాం విష్ణు అన్నారు. సోమవారం నాడు లైన్స్ క్లబ్ సభ్యుడు మనోహర్ రెడ్డి సహకారంతో, బేతంచెర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బేతంచెర్ల శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు వృద్ధులకు, గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు షేక్షావలి, ధనుంజయ, వలి బాష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుకు నేడు ఆఖరు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ఖరీఫ్ సాగు పంటలను నమోద చేసుకోవడానికి నేడు చివరి రోజు కాబట్టి రైతులు తప్పనిసరిగా ఈకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు తెలిపారు. సోమవారం నంద్యాల మండలం చాపిరేవుల రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకెవైసికి చివరి రోజు కాబట్టి ప్రతి రైతు దగ్గరలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి చేయించుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేయించుకుని ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు అందుతాయని తెలిపారు.

ఘనంగా కాన్షిరాం వర్ధంతి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని కాన్షిరాం విగ్రహానికి బిఎస్‌పి నాయకులు పూల మాలలను వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి నందికొట్కూరు అసెంబ్లీ ఇన్చార్జి ఎల్ స్వాములు మాట్లాడుతూ కాన్షీరాం బాటలో నడిచి బహుజనులకు రాజ్యాధికారం తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

వెండి వస్తువులు బహూకరణ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు నెల్లూరుకు చెందిన పాల పెంచలయ్య సోమవారం నాడు పలు రకాల వెండి వస్తువు లను సమర్పించినట్లుగా దేవస్థానం అధికారులు సోమవారం తెలిపారు. వస్తువుల విలువ రూ. 2,32,901లు ఉంటుందని దాతలు తెలిపారు. దాతలు వెండి వస్తువులతో కుటుంబ సమేతంగా కలసి ముందుగా స్వామి అమ్మవారిని దర్శించుకుని, ఆ తర్వాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద ఆశీర్వచనం మండపంలో వెండి వస్తువులను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసి నట్లుగా ఆలయ అధికారులు తెలిపారు. **అన్న ప్రసాద పథకానికి విరాళం:** శ్రీశైల దేవస్థానం శ్రీశైలం వచ్చే భక్తులకు యాత్రికులకు నిత్యం అందిస్తున్న అన్నదాన పథకానికి అన్న ప్రసాద విత్తనానికి విరాళములు పలువురు విరాళములు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన జె శ్రీనివాస విజయ గణపతి రూ.1,00,116, సికింద్రాబాద్‌కు చెందిన కే ఉమామహేశ్వరరావు రూ.1,00,116 ఆలయ పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - రుద్రవరం

సిరివెళ్ల మండలంలోని బోయలకుంట్ల మెట్ట సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. రుద్రవరం మండలం కోటకొండ గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య మద్యం మత్తులో మోటార్ సైకిల్ నడుపుతూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోయలకుంట మెట్ట సమీపంలో గిద్దలూరు-నంద్యాల రోడ్డు మార్గంలో పక్కనే ఉన్న పొలాలలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న రోడ్ సేఫ్టీ పోలీస్‌లు మోటార్ సైకిల్‌ను, బొక్క వెంకటసుబ్బయ్యను గాజులపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'విప్లవ వీరుడు చేగువేరా'

బేతంచర్ల : బేతంచెర్ల పట్టణంలో చేగువేరా 56వ వర్ధంతినిఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వై ఉదయ్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్ హాజరై చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెగువేరా స్ఫూర్తితో ప్రతి ఒక్కరు తమ హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ మండల ఎల్లకృష్ణ, శ్రీకర్, దిలీప్, భాస్కర్, హరి, ప్రదీప్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

O.S. NO.655/2020

బీరం క్రిష్ణా రెడ్డి & వగైరాలు.
...వాదులు

వర్సెస్

కుమ్మరి శరభయ్య & వగైరాలు. ...ప్రతివాదులు
D3. కుమ్మరి నడిపి సుబ్బరాయుడు, వయసు సుమారు 50 సం॥, తండ్రి బాలన్న, హిందూ, వ్యవసాయం, సుబ్బరాయుడు కొత్తూరు గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా (ఇంతకుముందు కర్నూలు జిల్లా)

3వ ప్రతివాది కి దావా సమన్లు

పై దావా నందు వాదులు, ప్రతివాదుల పై దావా దాఖలు షెడ్యూల్ ఆస్తి పైన పర్మినెంట్ ఇంజక్షన్ కోరి దావా దాఖలు చేసి ఉండి. 3వ ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ.20-10-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ. 20-10-2023

ఇట్లు
K.రామకృష్ణయ్య
వాది పరం అడ్వకేట్, నంద్యాల.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

O.S. NO.267/2021

గంగవరం నారాయణరెడ్డి.
...వాది

వర్సెస్

వడిశేలగారి తులిశన్న died by his L.Rs.
1.వడిశేలగారి తొలిశమ్మ & వగైరాలు. ...ప్రతివాదులు
D4. వడిశేల ఈశ్వరమ్మ వయసు సుమారు 40 సం॥, భర్త లేటు వెంకట లింగం, హిందూ, వ్యవసాయం, చాబోలు గ్రామం, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా (ఇంతకుముందు కర్నూలు జిల్లా)

4 వ ప్రతివాది కి దావా సమన్లు

పై దావా నందు వాది, ప్రతివాదుల పై దావా దాఖలుచేసి ఉండి ప్రామిసర్ నోటు డబ్బులు మొత్తం 93,900/- రాగోరి 4వ ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ.20-10-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ.20-10-2023

ఇట్లు
K.రామకృష్ణయ్య
వాది పరం అడ్వకేట్, నంద్యాల.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

I.A.No.1371/2020
IN
O.S. NO.655/2020

బీరం క్రిష్ణా రెడ్డి వగైరాలు. ...అర్జీదారులు /వాదులు

వర్సెస్

కుమ్మరి శరభయ్య & వగైరాలు.
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

3వ రెస్పాండెట్

కుమ్మరి నడిపి సుబ్బరాయుడు, వయసు సుమారు 50 సం॥, తండ్రి బాలన్న, హిందూ, వ్యవసాయం, సుబ్బరాయుడు కొత్తూరు గ్రామం, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా (ఇంతకుముందు కర్నూలు జిల్లా)

3 వ రెస్పాండెంట్/ప్రతివాది కి Order 5 రూల్ 20 C.P.C కింద నోటీసు.(ఆర్డర్ 39 rule 1& sec.151 C.P.C).

పై దావా నందు వాదులు, ప్రతివాదుల పైన దావా దాఖలు షెడ్యూల్ ఆస్తి పైన పర్మినెంట్ ఇంజక్షన్ కోరి దావా దాఖలు చేసి ఉండి.ఆర్డర్ 39 rule 1& sec.151 C.P.C కింద టెంప్రావరీ ఇంజక్షన్ ఆర్డర్ కోరి అర్జీ దాఖలు చేయగా, 3వ రెస్పాండెంట్/ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు ఉద్దేశ పూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ.20-10-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ.20-10-2023

ఇట్లు
K. రామకృష్ణయ్య,
వాది పరం అడ్వకేట్, నంద్యాల.